# గోటితో పోయేదానికి...

సునంద ఫోనుచేసింది 'పనయ్యాక ఓసారి రాగలవా' అంటూ "ఏం బజారు కెక్కడికన్నా వెళ్లాలా' అన్నా -యిద్దరం కల్సి పదకొండు గంటలవేళ సాదారణంగా ఏషాపింగ్‌కో కల్సి వెడుతుంటాం.

'కాదులే, ఓసారి రా పనుంది' అంది కాస్త గొంతు తగ్గించి 'ఏమిటి విషయం, ఏం జరిగింది' కుతూహలం నిలవనీయలేదు నన్ను 'రా... చెప్తా' అంటూ ఫోను పెట్టేసింది.

పదకొండు గంటలకి సునంద యింటికి వెళ్లేసరికి కావ్య తలుపు తీసింది. 'హాయ్ ఎప్పుడొచ్చావు' అన్న హఠాత్తుగా సునంద కూతుర్ని చూసి ఆశ్చర్యంగా. 'నిన్నరాత్రి వచ్చా ఆంటీ... రండి లోపలికి అంది.'

'రా.. ఒక్క నిమిషం కుర్చో వస్తున్నా, 'వంటింట్లోంచి తొంగి చూసి 'అంది' సునంద "ఏమిటీ సంగతులు. యిలా హఠాత్తుగా వచ్చావేంటి?"కావ్యనడిగా. కావ్య మొహం ఎందుకో కాస్త వాడినట్లనిపించింది. ఆమె మొహం నవ్వుతున్న కళ్ళల్లో నీలినీడలు కనిపించాయి. మనసులో చిన్న సందేహం.

'ఏముంది మళ్లీ వాళ్ళాయనతో దెబ్బలాడి వచ్చింది. 'పమిట కొంగుతో చెయ్యి తుడుచుకుంటూ వచ్చి అంది సునంద. కావ్య తల్లి వంక చురచుర చూసింది.'

"ఏమిటా చెప్పడం, దెబ్బలాటలన్నీ నేనే ఆడుతున్నట్టు. అంతా నాదే తప్పన్నట్టు చెప్తున్నావు" తల్లిని మింగేసేట్టు చూస్తూ కోపంగా అంది.

"ఏమో తల్లీ నీ తప్పో, కిశోర్ తప్పో నాకేం తెలుసు, మీ యిద్దరు దెబ్బలాడు కున్నప్పుడు నేను లేనుగా. ' సునంద కాస్త విరక్తిగా అంది.

'దెన్.. తెలియకుండా కామెంట్ చేయకు. బెటర్ కరక్ట్ యువర్ స్టేట్‌మెంట్' అంది తీవ్రంగానే. మాట యిటు అటు అయితే పడరీకాలం పిల్లలు అనుకున్నా, తల్లి అయినా ఒక్కమాట పడరు యీ పిల్లలు. తక్కెడతో తూచినట్టే పిల్లలతోనైనా మాట్లాడే రోజులు వచ్చాయి.

'సరేలేద్దూ.. ఊరికే చిన్న విషయాన్ని పట్టుకు అలా లాగడం ఎందుకు సర్దాను.

'చిన్న విషయం ఏమిటి ఆంటీ.. మమ్మీ ఎప్పుడూ నన్నే బ్లేమ్ చేస్తుంది. షి ఆల్‌వేస్

ఫైన్డ్ ఫాల్ట్ విత్‌మి' ఉక్రోషంగా అంది.

'లేకపోతే ఏం చెయ్యమంటావు. అమ్మా, తల్లీ , నీదేం తప్పులేదు అంతా అల్లుడిదే తప్పు. ప్రతిరోజు దెబ్బలాడి, పుట్టింటికి వచ్చేస్తూ వుండు. అతనేమన్నా అంటే ఒకటికి రెండు అను అని ఏ తల్లి చెప్పదు. ఏ తల్లి అయినా కూతురికి నచ్చజెప్పి, సర్దుకు కాపురం నిలుపుకో అనే చెప్తుంది. సిల్లీ విషయాలకి మొగుడ్ని వదిలి వచ్చేయ్ అని చెప్పడానికి ఐ స్టిల్ బిలీవ్ యిన్ మారేజ్ యిన్‌స్టిట్యూషన్' అంది సునంద కూడా గట్టిగానే. 'ఆ, గొప్పేలే. యిలాంటి మేరేజ్‌లు నిలవకపోతే కొంపేం మునగదు 'హేళనగా అంది కావ్య.

'చూడు, ఇలాంటి మేరేజ్‌లట! యీ మాత్రం దానికే కాపురాలు వదిలేసుకుంటే లోకంలో ఏ పెళ్లి నిలుస్తుంది. అతనే మన్నా దుర్మార్గుడా, శాడిస్టా, నిన్ను ఫిజికల్‌గా మెంటల్‌గా, హింసిస్తున్నాడా. చెప్పు. అలాంటిదేమన్నా వుంటే తప్పక నిన్నే సపోర్ట్ చేస్తాను.' అంటే, పెళ్ళాన్ని పట్టుకు చితకబాది, యింట్లోంచి గెంటేంతవరకు మంచి మొగుడేనన్నమాట నీ దృష్టిలో.' మరికాస్త హేళనగా రెట్టించింది కావ్య.

'అబ్బేలేదు. 'వంట నేనే చెయ్యాలి' అని నీవంటే 'అబ్బే నేనే చేస్తానులే' అని అతను అనాలి. అతను కాఫీ అడిగితే 'వెళ్లి చేసుకో' అని నీవంటే 'చిత్తం అని అతననాలి' 'యిల్లుకాస్త సర్దు' అంటే 'నాకెందుకు చెప్పడం' అదేదో నీవే చెయ్యచ్చుగా' అని నీవన్నా అతను తలూపాలి. ఆఫీసునుంచి యింత ఆలస్యం అయిందేం అని మామూలుగా అడిగినా 'అబ్బే...ఆఫీసులో లవ్ ఎఫైర్ జరుపుతున్నా కొలీగ్స్‌తో' అని నీవు దులపరించినా అతను నవ్వేసి కోపం తెచ్చుకోరాదు. 'నీవు ఉద్యోగం చేసి అతనితో పాటు సరిసమానంగా సంపాదిస్తున్నావు గనక యిద్దరికీ ఏం తేడాలేదు కనుక ఆడ మగ పనులు యిద్దరూ షేర్ చేసుకోవాలని నీవంటావు. దానికి కాస్త యిటూ అటుగా ఏదన్నా జరిగితే నీ ఆత్మాభిమానం దెబ్బతినేస్తుంది. ఏ చిన్నమాట అనుకున్నా గోరంతలు కొండంతలుగు ఊహించి నీ వ్యక్తిత్వం దెబ్బతిందని బాధపడిపోతావు. యిలా ప్రతి చిన్నదాన్ని భూతద్దంలోంచి చూస్తూ గొడవపడితే ఏ కాపురం నిలవదు. యీ మొగుడ్ని వదిలి యింకో మొగుడ్ని కట్టుకున్నా ఏ మాత్రం గొడవలులేని కాపురం వుండదుఅని తెలుసుకో అని పదిసార్లు చెప్పాను యిప్పుడు మరోసారి చెప్తున్నా' సునంద కాస్త కఠినంగానే అంది. కావ్య మొహం ఎర్రబడింది. చివాలున తలెత్తి 'నన్నర్థం చేసుకోని మొగుడు నా కక్కరలేదు. ఎడ్జస్ట్ చేసుకుని బతకాల్సిన అవసరం నాకేంలేదు.' తలెగరేసి పొగరుగా అంది. 'ఇద్దరు కలిసి బతకాలంటే ఎడ్జస్ట్‌మెంట్ తప్పదు. ఏం మనింట్లో మనం ఏం అనుకోడం లేదా మాటామాట. నిన్ను నేనేం అనలేదా, మీనాన్న అనరా, నీవు రాహుల్

ప్రతిదానికీ ఆర్గ్యూ చేసుకుంటూ వున్నన్నిరోజులు యిక్కడ దెబ్బలాడుకోలేదా. అపుడు యిల్లొదిలి ఎక్కడికి వెళ్లిపోయావు కోపం వస్తే' నిలేసింది. 'ఇదివేరు అదివేరు. మమ్మీ, డాడీ, అన్న, తమ్ముడు అనుకోవడం వేరు. 'ఏమిటివేరు ఏ యిద్దరి అభిప్రాయాలూ ఒకలా వుండవు. ఆ రెండో మనిషిని కన్విన్స్ చేయగలగాలి నీకే తెలివుంటే, దెబ్బలాడటం గొప్పకాదు, మనిషిని నీవైపు తిప్పుకునే చాకచక్యం వుండాలి. . ఒక యింట్లో వున్నప్పుడీ అభిప్రాయభేదాలొస్తుంటాయి.' ఆ... కబుర్లు చెప్పడం సులువే, కాపురం చేయడం అంత సులువు కాదు. సునంద విరక్తిగా చూసింది నా వంక.' యిదీ దీని వరస' అంది.

తల్లీకూతుళ్లు ఎడాపెడా రెండువైపులనుంచి వాయింపుడతో సగం సంగతి అర్థమైంది. ఇది, యీ సంఘటనా మొదటిది కాదు, ఈ వాదనా మొదటిది కాదు, సునంద కూతురి కాపురం గురించి యిదివరకోసారి చెప్పింది. కావ్యనే ముందునుంచి తెల్సిన దాన్ని కనుక సునంద మాటలని, ఆమె పడ్తున్న ఆరాటాన్ని అర్థం చేసుకోగలను. కావ్యని మాటలతో ఎవరూ ఒప్పించలేరన్నది ఎన్నోసార్లు అర్థమైంది. కావ్యేమిటి. ఈ కాలం అమ్మాయిల ఆలోచనలు, వాదనలు అన్నీ చాలావరకు ఒకలాగే వుంటాయి. వాళ్లతో వాదన పెట్టుకుంటే ఆఖరికి తగ్గాల్సింది మనమేనని సునందకి, నాకు ఎప్పుడో అర్థమైంది. కావ్య తెలివైన పిల్ల. కంప్యూటర్ యింజనీరింగ్ చదివిన పిల్ల. కేంపస్ సెలక్షన్ లోనే విప్రోవారి ఉద్యోగం సంపాదించుకుంది పదిహేనువేల జీతంతో. మరి అలాంటి అమ్మాయిలకి కాన్ఫిడెన్స్కేం తక్కువుంటుంది. ఏ బాధా లేకుండా ఆడింది ఆటగా పెరిగి, తను కోరుకున్న చదువుకునే అవకాశం కల్పించిన యింట్లో కాస్తో కూస్తో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు యిచ్చిన తల్లిదండ్రుల మధ్య పెరిగి, ఉద్యోగంలో చేరి తోటి కొలీగ్ని ఏడాదిప్రేమించి అన్నీ తెల్సుకున్నానని అతనికి తనకి బాగా కల్సిందని నమ్మకంతో తల్లిదండ్రులని ఒప్పించి పెళ్లాడింది.

'మనమేమన్నా బలవంతపెట్టి పెళ్లిచేశామా, అదే ఎంచుకుంది. కల్సి తిరిగారు. యిష్టపడ్డారు. పెళ్ళాడారు. పెళ్ళాడిన ఆరునెలలనించి, ప్రతిదానికి గొడవలేమిటిట! ఆ ప్రేమా దోమా ఎటెళ్ళిపోయిందో ఆరునెలలకే హేళనగా అంది సునంద. నిజం చెప్పాలంటే ముందు కాస్త అపోజ్ చేసింది. ఒకటి అబ్బాయి పంజాబి అని, రెండు కావ్యకు ముందునుంచి నాన్వెజ్ అంటే పరమ అయిష్టం. మసాలాకూడా తినని కూతురు నాన్వెజిటేరియన్తో ఎలా సర్దుకుంటుంది ఏం ప్రాబ్లమ్స్ వస్తాయో ముందు ముందు అని భయపడింది. కాని కావ్య ఆ సందేహాలన్నీ కొట్టిపారేసింది. తన కోసం అతను నాన్వెజ్ వదిలేసాడని, తనకోసం ఏమన్నా చేస్తాడని నమ్మకంగాచెప్పింది. ఆలోచించు

బాగా అని చెప్పిన తల్లిదండ్రులకి 'ఐయామ్ కాన్ఫిడెంట్ ఎబౌట్ హిమ్' అని కాన్ఫిడెంట్‌గా చెప్పింది.

'మమ్మీ, నీవేం హేళన చెయ్యనక్కరలేదు. ఆ ఈడియట్ నా చుట్టూ ఎలా తిరిగాడు. నీకు తెల్సుకదా. ఎన్ని ప్రామిస్‌లు చేశాడు. అప్పుడు ఎంత ఎటెన్షన్ చూపేవాడు. నేను మాట్లాడిన ప్రతి మాట వేదంలా వినేవాడు. పెళ్లికి ముందే అన్ని మాట్లాడుకున్నాం. యింట్లో పనీపాట యిద్దరం చేసుకోవాలని, ఒకరి అభిప్రాయాలని, యిష్టాలని రెండోవారు గౌరవించాలని, ఒకరి ఆఫీసు విషయాల్లో ఇంటర్‌ఫియర్ అవరాదని, అన్నీ ముందే మాట్లాడుకున్నాం. అపుడంతలా తిరిగాడు యిప్పుడసలు పట్టించుకోడేం. కూచోపెట్టే కాఫీ చేసేవాడు. నా కోసం వంటలు నేర్చుకుని ఉప్మా, బజ్జీలు అవీ వేసి తినిపించేవాడు. యిప్పుడు వంటపనంతా నాదన్నట్టు పట్టించుకోడు. ఏదన్నా అంటే దబాయిస్తాడు. అపుడు ఎంత రొమాంటిక్‌గా వుండేవాడు. యిప్పడు చచ్చు పెద్దమ్మలా లేజీగా పడుకుంటాడు. నాన్‌వెజ్ మానేస్తానని ప్రామిస్ చేశాడు. యిప్పుడు బయటనించి తెచ్చుకుని తింటున్నాడు నిన్నేం వండమనడం లేదుగా అని సమర్ధించుకుంటాడు, ఏదన్నా అంటే నే మారిపోయానని కయ్యానికి కాలుదువ్వుతానని నన్నే బ్లేమ్ చేస్తున్నాడు. నాకేం సెల్ఫ్ రెస్పెక్ట్ లేదా, ప్రతిదానికీ నేనే సర్దుకోవాలి. నేనే ఎందుకు తగ్గాలి. అస్తమానూ.. పెళ్లికి ముందులా అసలు లేడు.' కావ్య నేరాలు వల్లించింది నావైపు చూస్తూ.

"వుండడు. ఏ మగాడూ పెళ్ళికి ముందులా వుండడు. అలా వుంటాడనుకోడం నీ ఫూలిస్‌నెస్. పెళ్ళయ్యేవరకు ప్రతి మగాడు ఆడదాని చుట్టూ అలాగే తిరుగుతాడు. పెళ్లి అయి, భార్య అయ్యాక కూడా గర్ల్‌ఫ్రెండ్ మీద చూపించినట్టు ఎటెన్షన్ రోజూ ఎవరు చూపిస్తారు. రోజులో ఓ గంటో రెండు గంటలో కల్సుకున్నప్పుడు వుండే థ్రిల్లు రోజూ యింట్లో కనిపించే మనిషి మీద అంతే యింటరెస్ట్ చూపిస్తాడని నీవనుకుంటే అది నీ తెలివితక్కువతనం. ఒకరి వీక్‌నెస్‌లు, మైనస్‌పాయింట్లు, అసలు స్వభావాలు కల్సి జీవించడం ప్రారంభించే వరకూ బయటపడవు. అసలు నైజాలన్నీ అపుడు తెలుస్తాయి. పెళ్లికి ముందు ట్రిమ్‌గా, స్మార్ట్‌గా తయారై గర్ల్‌ఫ్రెండ్ దగ్గరికి వెళ్లినట్టు యిప్పుడు యింట్లోనై అలా డ్రస్సయి కూర్చోరు. అతనైనా నీవైనా, ఆఫీసునుంచి రాగానే నలిగిన పైజామా, చెదిరిన క్రాపూ, జిడ్డుమొహం కనపడచ్చు. అతనికీ నీ జిడ్డొడుతున్న నీ అలిసిన మొహం చూసి, మొహం మొత్తుతుంది కావ్యా, రియా లిటీస్ అర్ధం చేసుకోకుండా ఏదో యిద్దరికిద్దరూ మోసపోయినట్టు బాధపడడంతో అర్థంలేదు. చిన్నప్పటినుంచి నాన్‌వెజ్ అలవాటుపడినవాడు ఒక్కసారి ఎలా మానతాడు. అతను మానలేదు, నీవు తినలేవు. నిన్నేం చెయ్యమనలేదుగా. నిజంగా నీ కతనిమీద ప్రేముంటే

అతని యిష్టాన్ని అర్థం చేసుకోవాలి. అయినా యిలాంటి చిన్న విషయాలకి రోజూ జగడాలు పెట్టుకుంటే  ఏ భార్యా భర్తా కాపురాలు చెయ్యలేరు. 'కావ్యని కన్విన్స్ చేయడానికి ప్రయత్నాలు ఆరంభించాను. "ఆ వినడానికి చిన్న విషయాలే ఆంటీ, ఆ సందర్భం అనుభవంలోకి వస్తే ఎవరికి వారికి అర్థం అవుతుంది. కావ్య కినుకుగా అంది. 'ఆ మాకూ పెళ్ళిళ్లయ్యాయి. మాకూ మొగుళ్లున్నారు. మేమూ మాట మాట అనుకుంటాం. దెబ్బలాడుకుంటాం., అరుచుకుంటాం, మర్చిపోతాం, కల్సిపోతాం, సర్దుకుపోతాం. యివన్నీ ప్రతి పెళ్ళికీ వుండేవే, నీ ఒక్కర్తివేగాదు కాపురం చేస్తుంది' సునంద కోపంగా అంది.

'ఆ. మీరంతా గతిలేక సర్దుకుపడి వున్నారు. నాకేం ఖర్మ అలా అణిగి మణిగి పడుండానికి. అతనితో అన్నింట్లో సరిసమానంగా వున్నాను. అతనికి దండాలు పెడుతూ భయపడి బతకాల్సిన అవసరం ఏం లేదు' పొగరుగా అంది. 'కావ్యా నీలా ప్రతి అమ్మాయి ఆలోచిస్తే ఏ కాపురం నిలబడదు. ఏ పెళ్ళికీ అర్థం వుండదు. పెళ్ళికి ముందు ప్రేమించుకున్నారు. ఒకరినొకరు అర్థం చేసుకున్నామనుకున్న మీరే ఏడాది కాకుండానే యిలా తగువులకి దిగుతున్నారంటే ఒకరినుంచి ఒకరు టూమచ్ ఎక్స్‌పెక్టేషన్స్ పెట్టుకుని అవి నిజజీవితంలో జరగలేదన్న నిరాశకి లోనవుతున్నారనిపిస్తుంది. దానికి తోడు మీకు ఆర్థిక స్వాతంత్ర్యం యిచ్చిన భరోసాతో మగాడ్ని, మొగుడ్ని కేర్ చేయనక్కరలేదు. వీడు కాకపోతే మరోడు అన్న నిర్ణయాలు చాలా తొందరగా చేస్తున్నారనిపిస్తుంది. యింతంత చిన్న సమస్యలనే మీరు తట్టుకోలేకపోతున్నారంటే మీ భవిష్యత్తు పట్ల భయంగా వుంది మా తరంవారికి. యిలా పెళ్ళిళ్లు, విడిపోవడాలు, మళ్ళీపెళ్లి, మళ్లీ సర్దుబాటు లేకపోవడం యిదంతా ఎటు దారితీస్తుంది భవిష్యత్తులో అనిపిస్తూంది.'

'భార్యాభర్తల కంపాటబిలిటి లేకపోవడం చిన్నసమస్యలా మీకనిపిస్తుంది కాబోలు' కావ్య ఏదో అనబోతుంటే చేత్తో వారించాను. 'చూడు కావ్యా, కడుపులో చల్ల కదలకుండా అమ్మానాన్నల నీడలో, ప్రేమానురాగాల మధ్య పెరిగి, కావల్సినంత చదువు చెప్పించి, తల్లిదండ్రులు మీ బంగారు భవిష్యత్తుకి బాటవేస్తే, ఉద్యోగాలు సంపాదించుకుని, లగ్జరీస్ సమకూర్చుకుని, కావాల్సిన వారిని నచ్చినవారిని పెళ్ళాడి సెక్యూర్డ్ లైఫ్ పొందిన మీరు - తీరి కూర్చుని ఏవేవో ఊహించుకుని, సమస్యలు సృష్టించుకొని చాలా బాధపడిపోతున్నట్లు మీ వ్యక్తిత్వాలకి, గౌరవాభిమానాలకి భంగం వాటిల్లినట్లు అవమానపడిపోతూ యివే సమస్యలను కోవడం వింటుంటే నాకు నవ్వాలో ఏడ్వాలో తెలీడం లేదు. కావ్యా, గ్రోఅప్, బయట ప్రపంచాన్ని ఓసారి లోతుగా పరిశీలిస్తే మీరెంత అదృష్టవంతులో తెలుస్తుంది. కావ్య అర్థం కానట్టు చూసింది. సునంద ఏదో

అనబోతూంటే వారించాను. 'కావ్యా, యీ మధ్య 'చైల్డ్ ఎబ్యూజ్' మీద ఓ సెమినారు లాంటిది జరిగింది. అక్కడ ఒక సైకాలజీ డాక్టరు చెప్పిన విషయాలు వింటూంటే ఎప్పుడూ వినని ఆ విషయాలు వింటుంటే వళ్ళు జలదరించింది. యింతంత ఘోరాలు ఆడప్లిలలకి ముక్కుపచ్చలారని అమ్మాయిల పట్ల జరుగుతూంటే అవేం మనదాకారావు. మనకు తెలియవు. తెల్సినా ఏదో వార్తలా చదివి మర్చిపోతాం. ఐదేళ్ళు, ఆరేళ్ల పదేళ్ల నిండని పసిమొగ్గల్ని, పెద్దమనిషి కూడా అవని అమ్మాయిలని తమతమ విపరీత సెక్సువల్ ధోరణులకి ఎలా హింసించి వినియోగించుకుంటున్నారో చెప్తుంటే నిశ్చేష్టులైవిన్నాం. కొంతమంది ఆడపిల్లలని కిడ్నాప్ చేసి, కొంతమంది బీదరికం ఆసరాతో వెయ్యి రెండువేలకి ఆడపిల్లలని తల్లిదండ్రులు అమ్మితే కొని వాళ్లని పెంచుకుంటామని చెప్పి కొందరిని, ఏ అరబ్‌షేకుతో పెళ్లిపేరుతో కొందరిని, యిళ్లల్లో పనికని కొందరిని పదేళ్లు పన్నెండేళ్ళు నిండని పిల్లలని రకరకాలుగా తీసుకెళ్ళి పర్వర్టెడ్ సెక్సు జరుపుతూ వాళ్లని ఎలా హింసిస్తారో వాళ్ల తొడలమీద సిగరెట్ల వాతలు చెప్తాయి. వాళ్లు ఏడిస్తే నోట్లో గుడ్డలు కుక్కి వాళ్ల తుచ్ఛమైన కోరికలు రకరకాలుగా తీర్చుకుంటారుట. యింకా లొంగకపోతే తిండిపెట్టకుండా రెండు మూడు రోజులు మాడుస్తారుట. వాళ్ల పసినోళ్లల్లో వాళ్ల అంగాలు కూరి సెక్స్ జరపడం, విరియని పసి మొగ్గలు రక్తాలు ఓడుతుంటే, ఏడుస్తూ గిలగిల కొట్టుకొంటుంటే ఆనందిస్తూ, వికృత కామవాంఛాపరుల వినోదకేళి. ఎలా వుంటుందో వర్ణిస్తుంటే సభ్యసమాజం సిగ్గుతో తలలు దించుకోవాలి.

రక్తాలు ఓడే ఆ చిన్నారుల శరీరాలు కొన్నాళ్లకి మొద్దుబారిపోతాయట. బాధ, హింస స్థితి దాటిపోతే వారితోటి రకరకాల సెక్స్‌ఫోజుల్లో, పశువుల కంటే హీనంగా దిగజారి ఫోటోలు, వీడియోలు తీయించి యింటర్నెట్‌లకి, వెబ్‌సైట్లకి ఫీడ్‌చేసి రకరకాల వ్యాపారాలు చేస్తారట. వెయ్యిరూపాయలకి ఆడపిల్లలని అమ్మే తల్లిదండ్రులు, పూటగడవక పిల్ల రెండుపూటలా తిండైనా తింటుందని కొందరు పెంపకాల పేరుతో యిస్తే, పదేళ్ల పిల్లకి పెళ్లిచేసి బరువు దించుకోవాలని మరికొందరు మోసం, దగాతో కొందర్ని ఆడపిల్లల్ని ఎత్తుకుపోయి అమ్మే లుచ్చాలు యిలా రకరకాల కారణాలతో ఆ పసిపిల్లల జీవితాలని నరకం చేసే ఆకథలు వింటే నిజంగా సమస్యలంటే ఇవి, స్త్రీ సమస్యలివి అనిపించింది. అలా మొదలైన ఆ పసిపిల్లల జీవితాలు ఆఖరికి చేరేది వ్యభిచార గృహాలకి, వొళ్లమ్ముకుంటూ, రోగాలు అంటించుకుని, కడుపుకోసం నికృష్టజీవితం గడుపుతూ చీకటిలో మగ్గే ఆ ఆడవాళ్లని కదిలిస్తే ఒక్కొక్క కన్నీటి కథ వినిపిస్తుంది, కావ్యా, ఆ కథలు విన్నాక యింటిపట్టున అమ్మానాన్న నీడలో పెరిగి, చదువుకుని, ఉద్యోగాలు చేస్తూ పెళ్ళిళ్లు చేసుకుని సంసారాలు చేస్తూ ఏదో భర్తలతో

చిన్న చిన్న మాట పట్టింపులు వస్తే గోరంతలు కొండంతలుగా భావించి బాధపడిపోతూ తను వ్యక్తిత్వాలకి, ఆత్మాభిమానాలకి అవమానం జరిగిపోతున్నట్టు బాధ పడిపోతున్నాం, తీరి కూర్చుని సమస్యలు సృష్టించుకుంటున్నా, అట్టడుగు వర్గాలలో తాగుబోతు భర్తల, కాయకష్టం చేసి డబ్బు సంపాదించుకుంటూ పిల్లలని సాకే తల్లులు, ఆ డబ్బులు తన్ని లాక్కపోయే భర్తలు, కట్నాలుపోసి కాళ్ల కడిగి కన్యాదానం చేస్తే మరుసటి రోజునుంచి కట్నాలకోసం వేధించి చంపే మొగుళ్ళు, అత్తగార్లు, ఆడవాళ్లమీద అత్యాచారాలు, డబ్బాశ చూపి లేవదీసుకుపోయి వ్యభిచారాల గృహాలకి అమ్మేవాళ్ళు యిలా స్త్రీలు యీనాటికీ ఎన్నోరకాల హింసలు అనుభవిస్తున్నారు. మనచుట్టూ, ఎంతో దయనీయమైన స్థితిలో ఆడవాళ్ళు కనపడతారు. యివన్నీ ఒక ఎత్తు! పసి మొగ్గలని ఆడేపాడే వయసులో క్రూరంగా హింసించి వినోదించే సెక్సువల్ పెర్వరిస్టు ఒక ఎత్తు. యిలాంటి ఘోరకలి జరుగుతున్నా మనదాకా ఎప్పుడోగానీరావు. ఏ మానవతావాదులో, ఏ మహిళాభ్యుదయ సంఘాలో ప్రభుత్వదృష్టికి, పోలీసుల దృష్టికి తేచ్చేవరకు వారు పట్టించుకోరు. పేపర్లలో వార్తలొస్తే తప్ప మనలాంటి వారికి తెలియవు. చదివి ఆ క్షణాన కాసేపు బాధపడి మర్చిపోతాం. మొన్న ఇండియాటుడేలో ఓ వార్త వచ్చింది చదివే వుంటారు అంతా. ఒక విదేశీ దంపతులు బొంబాయిలో పెద్దహోటలులో మకాం పెట్టి, మురికివాడల్లో నివసించే ఆడపిల్లలమీద ప్రేమా, జాలి కురిపించి రకరకాల బొమ్మలు యిచ్చి మంచి చేసుకుని, వారిని హోటలు రూముకి తీసుకెళ్ళి స్నానాలు చేయించి, మంచిబట్టలు తొడిగించి, ఆపసిపిల్లలని వారి వికృత, పాశవిక కామకేళికి ఉపయోగించుకుంటూ, వీడియో టేపులుతీసి, యింటర్నెట్‌లకి వెబ్‌సైట్లకి, అమ్మి డబ్బు చేసుకుంటున్నారట. అవి అర్ధరాత్రి వరకూ చూసి అనందించే మన యువత! యిదీ యీనాటి సంస్కృతి! అలాంటి ఆడపిల్లల్ని రాబందులనించి రక్షించి వారికి శారీరకంగా మానసికంగా సేదతీర్చి వాళ్లని మామూలు మనుష్యులు చెయ్యాలన్న తాపత్రయంతో ఓ ప్రొటెక్షన్ సెల్‌లో సైకాలజీ డాక్టరుగా పనిచేస్తున్న ఓ డాక్టరు చెప్పిన విషయాలు విని ఓ రచయిత్రిగా ఎంతో స్పందించాను. ఇన్నాళ్లు ప్రేమలు, పెళ్ళిళ్లు, కాపురాలు, కలహాలు, విడాకులు యివే స్త్రీల సమస్యలనుకుంటూ మహిళా చైతన్యం, మహిళా సమస్యల గురించి కథలు రాస్తున్నానని అనుకున్ననేను మనకు తెలియని ఆ లోకం గురించి వింటే నిజంగా మనం ఎంత అదృష్టవంతులం అనిపించింది. అమ్మా, నాన్న, చదువులు, పెళ్ళిళ్లు, సంసారాలు, పిల్లలు అన్నింటి మధ్య సెక్యూర్డ్ లైఫ్ గడుపుతూ, కాస్త సర్దుబాటు అవలంబిస్తే సర్దుకుని సమస్యలని సైతం పెద్దవి చేసుకుని అపోహాలతో కష్టాలు, కలతలు సృష్టించుకుంటున్నారు అనిపించింది.

కావ్య మొహంలో కాస్త కలవరం, 'నిజంగా యిలా, యింత ఘోరాలు, దారుణాలు జరుగుతున్నాయా అంటీ, పసిపిల్లలమీద యిలాంటి అకృత్యాలు,ఘోరాలు, జరుగుతూంటే పోలీసులు, ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి?' ఆవేశంగా అంది. 'సరే పోలీసులు, ప్రభుత్వాలు సంగతి అలా వుంచు. యిదంతా విన్నాక నీ సమస్యలు ఎంత చిన్నవో అర్థమైందా?'

కావ్య కాస్త తడబడి, "అది వేరు యిది వేరు అంటీ, మన మధ్యతరగతి వారిలో అలాంటి ప్రాబ్లమ్స్ వుండవు".మనకివే సమస్యలు,. తగ్గిపోవడం యిష్టంలేక సమర్థించుకుంది. "ప్రాబ్లమ్స్ అనుకంటే జీవితంలో అన్నీ సమస్యలే. తెల్లారి లేచింది మొదలు మన సర్దుబాటు ప్రతి స్టేజీలో తప్పదు. పనిమనిషి మొదలు, ఆఫీసులో బాస్ దాకా మనం అన్నింట్లోనూ సర్దుకుంటూనే బతుకుతాం. ఆఫీసులో నీ బాస్ ఏదన్నా అంటే నీ మొగుడిమీద తిరగబడినట్టు తిరగబడి జవాబిస్తావా. బయట ఎంత సర్దుబాటు అవసరమో, యింట్లో యింతా అవసరం, పోనీ యీ భర్తకాదు యింకోడు నూటికి నూరుపాళ్లు నీకు నచ్చినట్టు వుంటాడని గ్యారంటీ వుందా? పోనీ మాకెవరూ అక్కరలేదు ఒంటరిగా బతకగలం అన్న ధైర్యం వుంటే పెళ్ళిళ్లు మాని ఉద్యోగాలు చేసుకుంటూ బతకండి. అబ్బే, అలాగా వుండరు. పెళ్ళిళ్లు కాకపోతే ఆ ఫ్రస్ట్రేషన్ అంతా యింట్లో తల్లుల మీదచూపిస్తారు. పెళ్లి చేసుకుని భర్త తననుకున్నట్లు లేడని మరో ఫ్రస్ట్రేషన్. మీకు అంతా మీరనుకున్నట్టు జరగాలంటే కుదరదు జీవితంలో. దీనికి సొల్యూషన్ ఏమిటో మీరే ఆలోచించండి. కిషోర్‌తో విడిపోవడం ఎంతసేపు! తరువాత ఏమిటన్నది ఆలోచించి ఓ నిర్ణయానికి రా. మొగుడు, సంసారం, పిల్లలు ఏమిఅక్కర్లేకుండా బతకగలనన్న నిబ్బరం నీకుంటే సరే, లేదంటే దొరికిందానితో సంతృప్తి పడడం నేర్చుకోండి. సమస్యలని సాల్వ్‌చేసుకునే విజ్ఞత మీకుంది. కాస్తంత సంయమనం పాటించడం అలవరుచుకోవాలి మీరు. ఎప్పుడూ మీ వైపునుంచే కాకఅవతలిమనిషి కోణం నించి కూడా ఆలోచించడం నేర్చుకోండి. మీవంతు మీరు సర్దుబాటుకి ప్రయత్నించి అప్పటికీ దారికి రాకపోతే ఓ నిర్ణయానికి రండి. యింతకంటే పెద్దవాళ్ళు అమ్మగాని ఎవరన్నా ఏం చెపుతారు? అస్తమానూ చిన్న తగూలకే పుట్టింటికి వచ్చి తల్లిదండ్రుల మనశ్శాంతి హరించడం తప్ప ప్రయోజనం ఏం వుండదు. నిజంగా నీది ఆలోచించాల్సిన ప్రాబ్లమ్ అని తల్లిదండ్రులు నమ్మితే తప్పకుండా నిన్నాదుకుంటాను. నీ ఖర్మానికి నిన్న వదిలేయరు యీ రోజుల్లో."

"అదే నేను చెప్పాను. యింక దానిష్టం ఆలోచించుకోనీ. మనం చెప్పాల్సింది చెప్పాం

. పాటించేది లేనిది దానిష్టం. కోరి కష్టాలు కొని తెచ్చుకుంటే అనుభవించాల్సింది అదే కాస్త విరక్తిగానే అంది సునంద.

'కావ్యా ఆలోచించు నీ చుట్టూ లోకం చూడు. మన స్త్రీలు ఎన్నెన్ని రకాల ప్రాబ్లమ్స్ మధ్య బతుకుతున్నారో ఓసారి ఆలోచిస్తే నీది చాలా చిన్న సమస్య అన్నది నీకే తడ్తుంది' భుజం తట్టి లేచాను.

* * *

రెండురోజుల తర్వాత సునంద ఫోనుచేసింది. 'నిన్న కావ్య బెంగుళూరు వెళ్ళింది' కాస్త ఈసారి మన మాటలు దాని బుర్ర కెక్కినట్టు కనిపిస్తూంది. తన సమస్యలు పెద్ద సమస్యలు కావన్నది దానికీ తట్టినట్టుంది. నీవు చెప్పిన ఆ పసిపిల్లల జీవితాల కథలు దాన్ని కాస్త కదిలించినట్టు అనిపించింది. కావ్య కాస్తంతయినా ఆలోచించిందంటే దానికి నీకు థాంక్స్ చెప్పుకోవాలి. 'సునందా, నిజం చెప్పనా, కావ్యకి చెప్పడమ కాదు. నాకూ యిన్నాళ్ళూ నే రాసిన కథలు కాకరకాయలు నిజమైన స్త్రీ సమస్యలని ఎత్తిచూపలేదన్నది తట్టింది. ఆ రోజు నేను విన్న సంఘటనలు నా దృక్పథాన్ని కొంతయినా మార్చింది సుమా' మనస్ఫూర్తిగానే అన్నాను.

◆ ఆంధ్రప్రభ వారపత్రిక మార్చి - 2001